క్లుప్తంగా

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థికసాయం


వైద్యానికి ఆర్థికసాయం అందిస్తున్న గురుస్వామి పీజే విజయ్ కుమార్

ధర్మవరం అర్బన్: మండలంలోని ఆకుతోటపల్లికి చెందిన క్యాన్సర్‌తో బాధపడుతున్న నాగార్జున రెడ్డి కుమార్తె హాసినికి అయ్యప్పస్వామి భజన మందిరం సభ్యులు అండగా నిలిచారు. చిన్నారి హాసిని వైద్యానికి అయ్యప్పస్వామి భజన మందిరం గురుస్వామి పీజే విజయ్‌కుమార్ తన శిష్య బృందం సమకూర్చిన రూ.1,11,500 ఆర్థికసాయాన్ని అందించారు. శుక్రవారం స్థానిక అయ్యప్పస్వామి భజన మందిరంలో చెక్కు అందజేశారు.

వైఎస్సార్ ఆసరాతో మహిళలకు లబ్ధి


ఆసరాపై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీల

పుట్టపర్తి టౌన్: డ్వాక్రా సంఘాల్లోని మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీల పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలో 10వ వార్డు గోకులంలో గోమాత ఎస్ఎల్ఎఫ్ మహిళా సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 23వ తేదీన వైఎస్సార్ ఆసరా పథకం కింద డ్వాక్రా రుణాల మాఫీకి సంబంధించి నాలుగో విడత సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో సీఎం జగన్ జమ చేస్తారని తెలిపారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సీఎంఎం రమాదేవి, సీఓ ఆదినారాయణ, ఆర్‌పీ భవానీ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం అర్బన్: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలోని చెరువు సమీపంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. స్నేహితులు, క్రీడాకారులు కలిసి షటిల్ టోర్నమెంట్ నిర్వహించడం హర్షణీయమన్నారు. అనంతరం టోర్నమెంట్‌లో మొదటి బహుమతి సాధించిన రంగం చైతన్యకుమార్, యంబా లోకేష్‌కు రూ.10 వేలు నగదు బహుమతితో పాటు మెమెంటోలు, రెండో బహుమతి డాక్టర్ మదన్‌మోహన్, ఆదినారాయణకు రూ.5 వేల నగదు బహుమతి, మూడో బహుమతి గుణశేఖర్, విజయ్‌కు రూ.2,500 నగదు బహుమతి, నాలుగో బహుమతి రమేష్, అలీకి రూ.1000 నగదు బహుమతులతో పాటు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ దాతలు, నిర్వాహకులు ఫయాజ్, మహేంద్ర, డాక్టర్ మదన్‌మోహన్, మేకల పురుషోత్తం, మురళీకృష్ణ, విజయ రాఘవ, వాసు, రామంజినేయులు, ఆదినారాయణ పాల్గొన్నారు.

22న సెలవు ప్రకటించాలి

కదిరి అర్బన్: శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఈనెల 22వ తేదీని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఏపీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. హిందువుల ఆరాధ్యదైవమైన శ్రీరాముని ప్రాణప్రతిష్ట జరిగే రోజున అందరూ 5 దీపాలు వెలిగించాలన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ఉచితంగా వైద్యం


తాడిమర్రి మండలం నార్శింపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న గోవర్ధన్ నాయుడు

పుట్టపర్తి అర్బన్/తాడిమర్రి/బత్తలపల్లి/గాండ్లపెంట: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహించారు. పుట్టపర్తి మండలం జగరాజుపల్లి సచివాలయంలో జరిగిన వైద్య శిబిరంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, ప్రత్యేకాధికారి డాక్టర్ శుభదాస్ పాల్గొన్నారు. జగరాజుపల్లిలో 206 మందికి, తాడిమర్రి మండలం నార్శింపల్లిలో 240 మందికి, గాండ్లపెంట మండలం సోమయాజులపల్లిలో 382 మందికి వైద్య పరీక్షలు చేశారు. పలుచోట్ల కంటి వైద్య పరీక్షలు చేసి, కళ్లద్దాలు పంపిణీ చేశారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం

● ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: పేదల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుడ్డంపల్లి తండా, ఒడ్డుకిందతండా, సానేవారిపల్లి, మల్లమ్మ కొట్టాల, ఎస్ఎస్‌పీ కొట్టాలలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక న్యాయంతో పాటు ఆర్థికంగా, రాజకీయంగా సామాజికంగా గుర్తింపు లభించిందన్నారు. గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాత్రమే పొందారన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులు లంచాలు తీసుకుని అనర్హులకు సంక్షేమ పథకాలు అందించి అర్హులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. కానీ నేడు అలాంటి పరిస్థితులు లేవన్నారు. అర్హత ఉంటే చాలు కుల, మతాలు, పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలన్నీ ప్రజల ఇంటి వద్దకే చేరుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం గుడ్డంపల్లి తండాలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన పరమేశ్ నాయక్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, సర్పంచులు శ్రీదేవి, నందిని, వెంకటరమణ, ఎంపీటీసీ మంజునాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరమణ, మునిస్వామి నాయక్, శివనారాయణ, శ్రీనాథ్, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లికార్జున, చంద్రానాయక్, మల్లి, రవీనాయక్, మోతీనాయక్, నారాయణస్వామి నాయక్, గిరిజా బాయి, తిరుపాల్ నాయక్, అశోక్‌నాయక్, మాధవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

రూ.86.20 లక్షలతో అభివృద్ధి పనులు

ముదిగుబ్బ: మండల పరిధిలోని మలకవేమల క్రాస్‌లోని సానేవారిపల్లి సచివాలయ పరిధిలో రూ.86.20 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. సచివాలయ నిర్మాణానికి రూ.43.60 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, విలేజ్ క్లినిక్‌కు రూ.20.80 లక్షలు వెచ్చించి నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మెన్ ఎ.రమణారెడ్డి, సర్పంచ్‌లు శ్రీదేవి, వెంకటరమణ, ఎంపీటీసీ మంజునాథ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం

ముదిగుబ్బ: మండల పరిధిలోని బూదనంపల్లిలో వెలసిన బూదలమ్మ దేవత ఆలయ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శుక్రవారం రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. సానేవారిపల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే.. ఈ మొత్తాన్ని గ్రామ పెద్దలకు అందజేశారు. గ్రామస్థుల ఆరాధ్య దైవమైన బూదలమ్మ దేవత అలయ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.5 లక్షలు అందజేయడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంగళరెడ్డి, ఎంపీటీసీ వెంకటశివారెడ్డి, గ్రామ పెద్దలు ఆనందరెడ్డి, సోమిరెడ్డి, వెంకటరెడ్డి, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


రూ.5 లక్షల విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ పిలుపునిచ్చారు. శుక్రవారం తలుపుల మండలంలోని 17 మంది వైఎస్సార్‌సీపీ సర్పంచులు, నాయకులు కార్యకర్తలు భారీగా కదిరికి తరలివచ్చారు. సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు విజయానికి తోడ్పడుతాయన్నారు. కదిరిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని నాయకులు కార్యకర్తలు తెలిపారు. కార్యక్రమంలో 17 మంది సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మక్బూల్ అహ్మద్‌ను సన్మానించిన సర్పంచులు, నాయకులు

రూ.1.55 కోట్లతో రోడ్డు నిర్మాణం

తలుపుల: మారుమూల గ్రామాలన్నింటికీ రోడ్డు సౌకర్యం కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే సిద్దారెడ్డి అన్నారు. మండలంలోని లక్కసముద్రం పంచాయతీలోని బాలిరెడ్డిపల్లి, గొందిపల్లి గ్రామాలకు రూ.1.55 కోట్లతో వేసిన తారు రోడ్డును శుక్రవారం సర్పంచ్ తులశమ్మ, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. గజ్జలప్పగారిపల్లిలో రూ.20 లక్షల వ్యయంతో వేసిన అప్రోచ్ రోడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇరవై ఏళ్లుగా జరగని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిందన్నారు. మండలంలో ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా రోడ్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు కనపడతాయన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, ఎంపీపీ రఫీనాయక్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు, జేసీఎస్ కన్వీనర్ టోపీ రమణ, సర్పంచులు శ్రీరామ్‌రెడ్డి, షేక్షావలి, పెద్దినాయుడు, పురుషోత్తం రెడ్డి, లోకనాథ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, మహమ్మద్‌పీర్, హరి, మౌలా పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

పారదర్శకంగా కులగణన


ధర్మవరం: కులగణన సర్వేను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న


గాండ్లపెంటలో వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

నల్లచెరువు/తాడిమర్రి/గాండ్లపెంట/ఎన్‌పీకుంట/ధర్మవరం: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో శుక్రవారం కులగణన సర్వే ప్రారంభమైంది. సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి కుటుంబ సామాజిక వర్గం, ఆర్థిక స్థితిగతులు, విద్య, అక్షరాస్యత తదితర వివరాలు సేకరించారు. అనంతరం యాప్‌లో వివరాలను నమోదు చేశారు. కులగణనను క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలని నల్లచెరువు తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శకుంతల, ఎంపీపీ రమణారెడ్డి ఆదేశించారు. తాడిమర్రి మండలంలోని గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు రాజేంద్ర, రిజ్వానా బేగం, అశోక్, ప్రమీల, మహిళా పోలీసు జ్యోతిర్మయి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చరణ్ తదితరులు సర్వే చేపట్టారు. గాండ్లపెంటలో వైఎస్సార్‌సీపీ నాయకులు కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, బీసీ కన్వీనర్ నరసింహగౌడ్, ఇక్బాల్, సికిందర్ సర్వేను పరిశీలించారు. ఎన్‌పీకుంటలో కులగణనను క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ ఆదినారాయణ అధికారులకు సూచించారు. సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తుండగా ధర్మవరం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, టీపీఆర్‌ఓ సుబ్బరాయుడు, మేనేజర్ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓడీచెరువులో 'విజయ సంకల్ప యాత్ర'

ఓడీచెరువు: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ప్రారంభించిన డాక్టర్ వైఎస్సార్ రైతు విజయ సంకల్ప యాత్ర శనివారం ఓడీచెరువు మండలంలోకి ప్రవేశిస్తుందని పార్టీ మండల కన్వీనర్ రాజునాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతు శ్రేయస్సే ధ్యేయంగా సాగుతున్న దుద్దుకుంట పాదయాత్రలో వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, ఎంపీపీ ఫర్వీన్ భాను, జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్ భాషా, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మీరెడ్డి తదితరులు కోరారు.

రెండో రోజు పాదయాత్ర షెడ్యూలు ఇలా..

శనివారం ఉదయం 9 గంటలకు కుసుమవారిపల్లి వద్ద ఓడీచెరువు మండలంలోకి పాదయాత్ర చేరుకుంటుంది. దిగువపల్లి, గాజుకుంట పల్లి, సుందరయ్య కాలనీ, నారప్పగారిపల్లి మీదుగా సాగుతుంది. నల్లగుట్లపల్లి వద్ద భోజనం అనంతరం మల్లెంవాడ్ల పల్లి, భోగానిపల్లి, కుంట్లపల్లి క్రాస్, వీరఓబునపల్లి మీదుగా దొన్నికోటవారిపల్లి చేరుకుంటుంది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రాత్రికి అక్కడే బస చేస్తారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

కదిరి టౌన్: పట్టణంలోని కోర్టు రోడ్డులో ఉన్న న్యాయవాదుల సంఘం భవనంలో శనివారం ఉదయం 10 గంటలకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నారు. డాక్టర్ మదన్‌కుమార్, డాక్టర్ రేణుకారెడ్డి రేణుకా హాస్పిటల్ సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు న్యాయవాదుల సంఘం సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 7987891139, 9440488002 నంబర్లకు సంప్రదించాలన్నారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

కదిరి అర్బన్: అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు ఈనెల 24వ తేదీ ఉదయం 9 గంటలకు కదిరి నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం మైనుద్దీన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాణికపాకం, కంచి, స్వర్ణదేవాలయాలను కూడా దర్శించుకోవచ్చన్నారు. టికెట్టు ధర పెద్దలకు రూ.1,020 నిర్ణయించినట్లు తెలిపారు. 9052537054 నంబర్‌కు ఫోన్ పే ద్వారా డబ్బు చెల్లించి టికెట్ బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తనకల్లు: మండల పరిధిలోని గంగసానివారిపల్లి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. అమడగూరు మండలం కందుకూరుపల్లికి చెందిన ఆంజనేయులు తన భార్య, కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పనిపీద మొలకల చెరువుకు బయలుదేరాడు. అయితే గ్రామం దగ్గరకి రాగానే ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆంజనేయులుతో పాటు అతడి భార్య, కుమారుడికి బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


తనకల్లు: నినాదాలు చేస్తున్న నాయకులు

తనకల్లు: మండల పరిధిలోని మార్పురివాండ్లపల్లిలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి గంగులయ్య మాట్లాడారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో అందరూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పూల నరసింహులు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్, బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సంపంగి గోవర్ధన్, ఉపాధ్యక్షుడు కోటకొండ కిష్టప్ప, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆరుద్ర శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ సంఘం శంకర్, తవళం సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ అమర్, మానవ హక్కుల చైర్మన్ రామన్న, పారేసు, మల్లికార్జున, శ్రీనివాసులు, సురేష్, ఓబులేసు, మూర్తి పాల్గొన్నారు.

రామగిరి: విజయవాడలో అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్న సందర్భంగా రామగిరిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మీనుగ నాగరాజు, జెడ్పీటీసీ నాగార్జున పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలివెళ్లారు.

యోగి వేమన రచనలు ఆదర్శం


గాండ్లపెంట: కటారుపల్లిలో వేమన సమాధి వద్ద పూజలు చేస్తున్న దృశ్యం


ధర్మవరం: వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెడ్డి జేఏసీ నాయకులు


తగరకుంటలో యోగి వేమన జయంతిలో పాల్గొన్న రెడ్డి జేఏసీ నాయకులు

గాండ్లపెంట: విశ్వకవి, ప్రజాకవి యోగి వేమన జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కటారుపల్లిలో యోగివేమన సమాధి వద్ద ఏపీ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. ఏపీ రెడ్డి సంఘం అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కదిరి నాలుగు రోడ్ల కూడలిలో వేమన విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి హరినాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు బాబుల్‌రెడ్డి, నారాయణరెడ్డి, జిల్లా సంఘం నాయకులు చవ్వా శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజారెడ్డి, దాసిరెడ్డి, రాజశేఖరరెడ్డి, ఓబులరెడ్డి, గంగిరెడ్డి, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: విశ్వకవి, ప్రజాకవి యోగివేమన రచనలు ఆదర్శంగా నిలిచాయని రెడ్డి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామాటం శేషాద్రి రెడ్డి తెలిపారు. పట్టణంలోని రెడ్డి జేఏసీ కార్యాలయంలో శుక్రవారం యోగివేమన జయంతి సందర్భంగా పలువురు రెడ్డి జేఏసీ నాయకులు యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం రెడ్డి జేఏసీ గుర్తింపు కార్డులను సభ్యులకు అందించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రంగారెడ్డి, మాధవరెడ్డి, కాటమరెడ్డి, కోళ్లమొరం కేశవరెడ్డి, సంపత్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, మాధవరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: తన పద్యాలు, సాహిత్యం ద్వారా సమాజంలో మంచిని మేల్కొలిపిన మహాకవి యోగి వేమన అని రెడ్డి జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని తగరకుంటలో యోగివేమన జయంతి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద యోగి వేమన చిత్ర పటానికి జ్యోతిప్రజ్వలన చేసి పూజలు నిర్వహించారు. రెడ్డి జేఏసీ సంఘం నాయకులు మాట్లాడుతూ యోగివేమన ఆశయాలను తెలియజేసేలా రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి జేఏసీ సంఘం నాయకులు మహేశ్వరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి, అంజన్‌రెడ్డి, సదానందరెడ్డి, దేవానంద్‌రెడ్డి, గోవిందురెడ్డి, యుగంధర్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న టూటౌన్ సీఐ అశోక్ కుమార్

ధర్మవరం అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత. ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, టూటౌన్ సీఐ అశోక్ కుమార్, ఆర్టీసీ డీఎం సత్యనారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో యాంత్రిక తప్పిదాల కారణంగా ప్రమాదాలు జరిగేవన్నారు. ఇప్పుడు అధిక శాతం ప్రమాదాలు మానవ తప్పిదాల వల్ల చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అజాగ్రత్త, అవగాహన లోపంతో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆర్టీసీ డ్రైవర్లు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేష్, ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, ఏఈ సికిందర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు, జీపీ రెడ్డి, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

పొలం గట్టు కంచెకు నిప్పు


నిప్పు పెట్టడంతో కాలిపోయిన పొలం గట్టు ముళ్ల కంచె

కనగానపల్లి: మండలంలోని వేపకుంటలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలం గట్టుకు ఉన్న ముళ్ల కంచెకు నిప్పు పెట్టారు. దీంతో పొలం గట్టు పక్కన ఉన్న 20 చీనీ చెట్లు మంటలకు కాలిపోయాయి. బాధిత మహిళా రైతు లక్ష్మీదేవి తెలిపిన మేరకు.. గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో 5 ఎకరాల్లో 600 చీనీ చెట్లు సాగు చేస్తున్నారు. ఈ చెట్ల భద్రత కోసం చుట్టూ ముళ్ల కంచె వేయగా, రాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో కంచె పూర్తిగా కాలిపోయింది. దీంతోపాటు సమీపంలో ఉన్న చీనీ చెట్లు, కొన్ని వ్యవసాయ పరికరాలు కాలిపోయాయి. దీనివల్ల రూ.50 వేల వరకు ఆస్తి నష్టం సంభవించింది. బాధిత రైతు దీనిపై శుక్రవారం కనగానపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.